# ఓడు

ముందువెనుకలుగా వచ్చిన అభ్యర్థికీ, ప్రత్యర్థికీ నరేందర్ ఒక్కమాటే చెప్పాడు 'నేన్నీకు ఓటెయ్యను' 'ఎందుకు?' 'జవాబు చెప్పను' 'వేయించు' 'వేయించను'.

అది అసెంబ్లీ నియోజకవర్గం. ఇద్దరే అభ్యర్థులు, పాలకపక్షం, ప్రతిపక్షం. వాళ్ళు తమకృషి చెప్పారు. చేయగల సత్కార్యాలు వివరించారు.

నరేందర్ పదవీ విరమణ చేసిన ఎలిమెంటరీ స్కూలు టీచరు. ఏకాకిచదువు చెప్పటం చదువుకోవటం నిత్యకృత్యాలు. చెట్టే ఇల్లు. చదువు. పడక, నిద్ర, విశ్రాంతి, అన్నీ అక్కడే. పెన్షన్ పేద పిల్లలది. తన తిండీ తీర్థం ఇరుగు పొరుగుది. కట్టుబట్టలు, ఆరేసిన బట్టలు అంతే! పుస్తకాలు, దొంతర్లు దొంతర్లు. ప్రజలు అతడిమాట మన్నిస్తారు.

నరేందర్‌ని కమ్యూనిష్టు అనీ, మార్క్సిష్టనీ, నక్సలైటు అనీ అంటారు. పోలీసులెప్పుడూ అరెష్టు చేయలేదు.

అభ్యర్థుల కూలీ అనుచరులు వచ్చి అడిగినప్పుడు 'పరిసరాలు పాడుచేయొద్దు. పోయిరండి' అని సాగనంపాడు.

పోటీకి ముందు అభ్యర్థులు, పాలకపక్షం, ప్రతిపక్షం, ప్రతిపక్షం మిత్రపక్షం, శత్రుపక్షం కలిసి బేరసారాలు చేసి, చిల్లరమల్లర పార్టీ అభ్యర్థుల్ని అర్థించి, డబ్బు ఇచ్చి రంగంలో లేకుండా చేశారు.

ఈ ప్రయత్నంలో ఓటరు సమూహ ప్రతినిధిగా ఉన్న నరేందర్‌ని ఎవరూ సంప్రదించలేదు. ప్రజలతో నిమిత్తం లేకుండా రెండు పార్టీలు నిలబెట్టిన ఇద్దరిలో ఎవరో ఒకర్ని గెలిపించాలి.

అది బోధన్ దగ్గరి నియోజకవర్గం. అభ్యర్థులిద్దరిదీ ఒకే మతం, ఒకే కులం, ఒకే సంపద. కోటీశ్వర్లు, రౌడీలు, గూండాలు, అక్రమ సంపాదన పరులు, హత్యలు చేయించారు.

మా కులంకాదు, మా మతం కారు, మంచివాడు కాడు ఒక్కొక్కరు ఒక్కొక్కమాట.

అందరూ వాళ్ళు మా ప్రాంతం వాళ్ళుకారు అన్నారు. ప్రజల అభీష్టాలు పత్రికలు ప్రతిబింబించాయి. టీ.వీ. చానళ్ళు చూపించాయి. రేడియోలు వినిపించాయి.

అభ్యర్థులిద్దరిదీ సర్కారు ప్రాంతం. దేశ స్వాతంత్ర్యం రాగానే వాళ్ళు తెలంగాణాకు వచ్చారు. ఎకరం పదికీ పరక్కీ వేల ఎకరాల అడవులు కొన్నారు. చెట్లు నరికించారు. కలప అమ్మించారు. బొగ్గులు ఎగుమతి చేయించారు. ట్రాక్టర్లు దున్నాయి. నీళ్ళు వచ్చాయి. బీళ్ళు సాగుచేయించారు. వాళ్ళపంట పండింది. కోటీశ్వరులయ్యారు. రైతులు, భూకామందులు, కూలీలయ్యారు.

ఇక్కడి భూమి, ఇక్కడి నీరు, ఇక్కడి సంపద. అక్కడి వాళ్ళు సంపన్నులయ్యారు. అసలు భూపుత్రులు బికారులయ్యారు. మొదట్లో గుడిసెలు వేసుకొన్న వీళ్ళు మేడలు కట్టారు. మేడల్ని భవనాలను చేశారు. భవనాలను కోటల్ని కావించారు. ఒకనాటి కోటల వారసుల్ని దొరల్ని ప్రభువుల్ని, పటేల్ పట్వారీలను పిచ్చివాళ్ళను, చచ్చుసన్యాసుల్ని చేతకానివాళ్ళను, అష్టదరిద్రులను, నిష్ఠదౌర్భాగ్యుల్ని చేశారు. రైతుల్ని కూలీలుగా, కూలీల్ని కూటికి లేనివాళ్ళను, కూడులేనివాళ్ళు మాడిచచ్చేవాళ్ళను చేశారు.

'మా ప్రాంతంకాదు,మా సంస్కృతి కాదు, మాదేదికాదు మాలో వాళ్ళుకారు వీళ్ళు. మమ్మల్ని దోచి, నాశనం చేసిన దోపిడీ దొంగలు వీళ్ళు. వీళ్ళకు ఓట్లు వేయం' జనం నిర్ణయం.

'స్వతంత్ర దేశంలో మతం మంటకలవలేదు. కులం నిర్మూలనం కాలేదు. మా భాషకు గౌరవం లేదు. మమ్మల్ని మనుషులుగా చూడటం లేదు. మా ఓటు, పవిత్రమైన ఓటు వీళ్ళకు వేయం. సామూహిక భావన.

వాళ్ళ ప్రచారానికి మనుషులు కావాలి. కూలి ఇస్తారు. పోవాలా, వద్దా? తర్కించారు. శారీరక శ్రమకు కూలీ. మానసిక నమ్మకంతో పనిలేదు. కూలికి పోవచ్చు. నమ్మని పని చేయటం తగునా? తగదు. ప్రచారం చేయటం ఆత్మద్రోహం కాదా? చర్చించారు. ప్రచారానికి పోలేదు. కూలీరేటు పెంచారు. అయినా మనుషులు దొరకలేదు.

ప్రచారంలోనే ప్రలోభాలు. తాగినంత. తిన్నంత. ఊగిసలాట. అయినా జనం కదల్లేదు.

ప్రచారం బంద్. పంపకాలు షురూ! నోట్ల పండగ. కోట్లు తెచ్చారు. గోనె సంచుల్లో మోశారు. ఎంతిస్తారు? తీసుకొని ఏంచేయాలి? ఎన్నినాళ్ళు? ఇవాళ ఇస్తాడు. రేపటి కుండదు. అయిదేళ్ళు కులుకుతాడు. కులకనీయరాదు.

ఇంత డబ్బు! వాళ్ళేంచేసుకొంటారు? కట్టుకుపోతారా? కాలిబూడిదై కదా పోతారు?

ఇంతడబ్బు! ఎక్కడిది వాళ్ళకు. ఇక్కడిదే! ఎలా సంపాదించారు? దోపిడీ. కనిపించని దోపిడీ!

ఇక్కడ, వీళ్ళకు, ఇన్ని ఎకరాల భూమి ఎలా వచ్చింది? అమాయకత్వాన్ని బలిచేయటం.

ఈ నేలకు ఎంతో విలువ. ఈ నేల వాళ్ళతో వల్లకాటికి పోతుందా? బొందితో పోతుందా? ఎందుకీ మిడిసిపాటు?

ప్రాజెక్టులకు ఇదేభూమి. సెజ్‌లకూ ఇదే భూమి. ఎన్నివేల కోట్లు. ఎంత తినగలరు? పంచాలన్నా పనికిరాని డబ్బు!

ఆకలి, కూడు, గూడు, ఆసరా లేనివాళ్ళు ఓటు కోసం పంచే డబ్బు తీసుకోలేదు.

ఆ డబ్బు కోసమే భూములమ్ముకొన్నారు. ఆ డబ్బు కోసమే కూలిచేశారు. కక్కుర్తి పడ్డారు. అన్నీ పోయి ఏమీలేని వాళ్ళయ్యారు.

నెత్తిన చెంగేసుకువచ్చినవాళ్ళు పెత్తందార్లు అయ్యారు. కూడు గూడు గుడ్డ ఉన్నవాళ్ళు బికారులయ్యారు.

వాళ్ల డబ్బులో ఏదో మోసముంది. తెలిసిన మోసం, ఈ ఎరవేసి అయిదేళ్ళు అధికారం చెలాయిస్తారు. తెలియని మోసం, కోట్ల ఆస్తుల్ని వందలకోట్ల ఆస్తులుగా పెంచుకొంటారు.

ఎర వేయటం వాళ్ళకు ఆట, గాలం గొంతులో ఇరుక్కొని విలవిల లాడటం, చావటం తమ వంతు.

వాళ్ళ ఉచ్చులో పడరాదు. ఎరకారాదు. ఓటుకిచ్చే నోటు పుచ్చుకోరాదు. వాళ్ళ కోట్లకు కోట్లు జనం డబ్బు దిగమింగరాదు.

ఓటు రేటు పెంచారు. అయినా జనం ముందుకు రాలేదు.

వాళ్ళంటే ఉన్న అసహ్యంవల్ల, వాళ్ళ డబ్బు కూడా అసహ్యంగా మారింది. డబ్బు కలిగించే సదుపాయాలు కూడా రోతగా మారాయి. ఆకలిని కూడా భరించారు చావయినా భరిస్తారు. వాళ్ళ డబ్బు తీసుకోరు. తీసుకొని వాళ్ళనందలం ఎక్కించరు. కోట్లు కొల్లగొట్టనీరు. కులకనీరు. నోట్ల బలంతో వెకిలిచేష్టలు చేయనీరు. అధికారబలంతో అరాచకాలను సృష్టింపనీరు. ప్రజల ధనప్రాణమానాలకు ప్రమాదాలు వాటిల్లనీరు. వాళ్ళ హవా సాగనీరు. వాళ్ళ అహంకారం పెరగనీరు. సహజంగా డబ్బు చేదు కాకపోయినా, వాళ్ళమీద అసహ్యంవల్ల వాళ్ళ డబ్బుమీద కూడా అసహ్యం పెరిగింది.

వాళ్ళకు అర్థం కాలేదు.

డబ్బు పంపకం కాలేదు. బిర్యాని ఖర్చు కాలేదు. మందు పారలేదు. కిక్కు ఎక్కలేదు. లోకం ఊగలేదు.

డబ్బుతో ఏమయినా చేయగలమన్న ధీమా ఓడిపోయింది. ఓట్లు కొనగలమన్న అహంకారం ఓడిపోయింది. డబ్బు మొలిపించిన కొమ్ములు విరిగిపోయాయి. డబ్బు అశక్తతవల్ల, ధనవంతులు అశక్తులయ్యారు. వాళ్ళ అశక్తత పేదలకు, ఆనందం కలిగించింది. డబ్బు ఇవ్వగలిగే , ఇవ్వజూపే, ఇవ్వలేక సంపన్నుడు ఓడిపోయాడు. డబ్బు తీసుకోక పేదలు విజయులయ్యారు.

వాళ్ళ ఏడుపు ముఖం ప్రజలకానందంగా ఉంది. జనాల సంతోషం వాళ్ళకు మరింత ఏడుపు తెప్పించింది.

కానుపు ఆగనట్లే, ఓటింగూ ఎప్పుడోతప్ప ఆగదు. అరుపుల్లేవు. కేకల్లేవు. బందోబస్తుల్లేవు. పోలీసులు బీడీలు ముట్టించి బాతాఖానీలో పడ్డారు. పోలింగు ఆఫీసర్లు గోళ్ళు గిల్లుకొంటారు. నాటి దినపత్రిక మొదటి నుంచి చివరిదాకా చదివిందే చదువుతున్నారు.

చెరువుగట్టుమీద, మర్రిచెట్టునీడన, నరేందర్ పాకచుట్టూ జనం. ఎవరూ ఏమీ మాట్లాడటంలేదు. అతనేదో పేపరు చదువుకొంటున్నాడు.

'ఈ నేల సొమ్ము, ఈ భూముల సొమ్ము, వాళ్ళు కొల్లగొట్టిన ఈ ప్రజల సొమ్ము, వాళ్ళిస్తే తీసుకోవచ్చా?' 'తీసుకోరాదు' 'మరి?' 'దోచుకోవచ్చు' 'దోపిడీ నేరంకాదా?' 'వాళ్ళ దోపిడీ చట్టబద్ధం కాలేదా?' 'వాళ్ళు తప్పు చేశారని మనమూ చేయవచ్చునా?' 'చేయవచ్చు. ముల్లును ముల్లుతో తీసినట్లు' 'కేసుకాదా' 'సాక్ష్యం లేకపోతే కేసులేదు' 'కేసు లేనంతమాత్రాన తప్పు ఒప్పవుతుందా' 'తప్పొప్పుల నీతి నియమాల వైశాల్యం పెద్దది. కొన్ని తప్పులు ఒప్పులే! కొన్ని ఒప్పులు తప్పులే! ఈ దోపిడీని దోపిడీ చేయవచ్చు. తప్పుకాదు. నేరం కాదు. న్యాయమే!' 'వాళ్ళ డబ్బు పంచగలమా?' 'పంచగలం, కానీ దాని ఆచూకీ తెలియాలి'. 'భూమి పంచగలమా?' 'పంచగలం. అది ప్రజలది. ఆక్రమించగలం!' 'ఆస్తులు పంచగలమా?' 'డబ్బు, భూమికాని ఆస్తులు తెలిసినంతమేర పంచవచ్చు' 'వాళ్ళేమవుతారు?' 'నెత్తిన చెంగేసుకు వచ్చినవాళ్ళు కోట్లతో వాళ్ళ ఊళ్ళకు పోతారు'

నియోజకవర్గం చాలాకాలం నిద్రపోయింది. నియోజకవర్గ ప్రజలు మేలుకోగా పోలింగు బూతులు నిద్రపోతున్నాయి.

అభ్యర్థులు వచ్చి 'ఓట్లు వేయమని, సమయం మించి పోతుంద'ని ప్రాధేయపడుతున్నారు.

'మీ పేరిట ఉన్న భూములు, ఇళ్ళు, ఇళ్ళస్థలాలు, చేతి డబ్బు, లాకర్ల డబ్బు, గోనె సంచుల డబ్బు. షేర్లు, డిబెంచర్లు అన్నీ ఇచ్చేసి, తెలంగాణా వదిలేసి, మీ ఊరికి మీరు పోతామంటే ఓటేసే మాట ఆలోచిస్తా'మని నరేందర్ సూచించాడు.

ఇంతకాలం తాము చేసిన ఘనకార్యాలు వివరించి ఏ కొదవా లేకుండా చేశామన్నారు.

'నిజమే ఆకలికి కొదవలేదు. కూడు గూడు గుడ్డల అవసరాలకు కొదవలేదు. అవిద్యకు, అజ్ఞానానికి, అంధకారానికి కొదవలేదు. దోపిడీకి దుర్మార్గానికి, దౌర్జన్యానికి కొదవలేదు.

'ఈ కొదవలన్నీ లేకుండా చేస్తాం!'

'చాలా చేశారు. పేదల్ని నిరుపేదల్ని చేసి సంపన్నుల్ని సుసంపన్నుల్ని చేశారు. దేశ స్వాతంత్ర్య హత్య పూర్తి ఘనంగా చేశారు. అంటరానివాళ్ళు అంటరాని వాళ్ళు గానే ఉన్నారు. గిరిజనుల్ని ఇంకా పరాయీకరిస్తున్నారు. కులవృత్తుల వాళ్లను హీనంగా, నీచంగా దూరీకరిస్తున్నారు. సాయిబుల్ని పేదలుగా నిరుపేదలుగా మారుస్తున్నారు. మౌనంగా మానవత్వాన్ని హత్యచేస్తున్నారు.'

'మీకోసం నేను ఏమయినా చేస్తాను'

'మా కోసం చేయవు. నీకోసం చేసుకొంటావు. నీ పిల్లల కోసం, నీ బంధువుల కోసం, నీ కులం కోసం, నీ కుల జనం కోసం నువ్వు కక్కుర్తి పడతావు. గడ్డి కరుస్తావు. మమ్మల్ని నిచ్చెనగా చేసుకొని నువ్వు పైకెళ్ళి నిచ్చెన పడదన్నుతావు, కాలుస్తావు, బూదిద చేస్తావు.

'నాకు వేయరు సరే! నా ప్రత్యర్థికి వేస్తారా ఓట్లు?'

'దొందూ దొందే!'

'ఓటు మురిగిపోదా?'

'పోయినాసరే!'

'ఓటు వేయటం బాధ్యత. వేయకపోతే బాధ్యత నిర్వర్తించనట్లు, నేరందేశ ద్రోహం'

'కాదు'

'మరెప్పటికీ మీరు ఓట్లు వేయరా?'

'మా వాడు. మావంటివాడు, మాలోనివాడు. మాసేవవాడు, మాలో పుట్టి పెరిగిన తోటి', అభ్యర్థి అయినప్పుడు తప్పక ఓట్లు వేస్తాం'

'నేను మీ వాణ్ణే!'

'కాదు, ఎక్కడో పుట్టావు, పెరిగావు. ఇక్కడికి వలస వచ్చావు. కూలిలా వచ్చావు. మా పొలాలు కొన్నావు. గుడిసెలు కూల్చావు. మమ్మల్ని నాశనం చేశావు. నువ్వు పరాయివాడివి. శత్రువ్వి.'

'నన్ను మన పార్టీ నిలబెట్టింది!'

'ఎవణ్ణి అడిగి నిలబెట్టింది పార్టీ! ఇది మన పార్టీ కాదు. నీ పార్టీ. మీ పార్టీ!

'ఓటు వేయటం పవిత్ర కార్యం'

'ప్రతి సన్నాసిదీ ఇదేకూత! మాకిష్టమైన పార్టీ, అభ్యర్థీ లేకపోతే మేమెందుకు వెయ్యాలి ఓట్లు! ఎవరికి వెయ్యాలి వెయ్యదగిన అభ్యర్థులు లేనప్పుడు పవిత్రమైన ఓటును అపవిత్రులకు, అయోగ్యులకు వేయకపోతే దాని పవిత్రత కాపాడినట్లు.'

'జరగనున్న పరిణామాలకు మీరే బాధ్యులు'

'అరాచకం చర్య అయితే ప్రతిచర్య పవిత్ర కార్యమే!'

'నిప్పుల గుండంలో దూకవద్దు!'

'ఇంతమంది ఉచ్చులు పోస్తే నీ నిప్పుల గుండం చప్పగా చల్లారిపోతుంది. మా ప్రాణం మాకు తీపే! నీ ప్రాణం నీకూ తీపే! ప్రాణం భద్రం. ప్రాణభయం కలిగితే తక్షణం నీ ఊరికి తరలి పో!

సాయంకాలమయింది. బేలెట్ బాక్సులు సీళ్ళయ్యాయి. భద్రం చేశారు. ఓట్ల లెక్కింపు, క్షణాల్లో ముగిసిపోయింది

ఒకడు గెలిచాడు. వాడే యం.యల్.ఏ

ఇదా ప్రజాస్వామ్యం?